TGTEL/26/A5513

# వార్త దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 57 | 07 సోమవారం సెప్టెంబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు

## భారత్ ఓకే... కానీ...!

- ఏ ఒక్క నిర్దిష్ట మ్యాప్ నూ ఆమోదించడం లేదని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం
- సరిహద్దులు, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీపడేది లేదని తేల్చిచెప్పిన వైనం
- జమ్మూకశ్మీర్, లఢఖ్‌లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపాలని పట్టు

ప్రపంచ పటాల (వరల్డ్ మ్యాప్) విషయంలో ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభలో ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానానికి భారత్ మద్దతు పలికింది. ప్రపంచ పటాల్లో ఖండాలు, దేశాల సైజులను మరింత కచ్చితంగా, యథార్థంగా చూపించాలన్న ఈ ం, సరిహద్దుల విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని గట్టిగా స్పష్టం చేసింది. శతాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా వాడుకలో ఉన్న 'మెర్కేటర్ ప్రొజెక్షన్' మ్యాప్ ల్లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దవిగా కనిపిస్తాయి.

# 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

# వాళ్లంతా బయటకొచ్చారు

- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని
- 2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి
- భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు.గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.

...మిగతా 2 లో...

## 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం: మహేశ్ గౌడ్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన మధ్య తేడాపై చర్చకు సిద్ధమన్న మహేశ్ గౌడ్
- కేటీఆర్ సోషల్ మీడియాలో క్షణికానందం పొందుతున్నారని ఎద్దేవా
- తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క వాడిపోయిందని వ్యాఖ్య

తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీ సీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీ నామా చేయాలంటూ హైద రాబాద్ లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధ ర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీక రించే ధైర్యం ఉందా? అని నిలదీ శారు. గతంలో కేసీఆర్ చేసిన కొం డంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద పీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రం లో లేని విధంగా నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.



## ధర్నాలు మాని అసెంబ్లీకి రండి.. సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం: శ్రీధర్‌బాబు

- బీఆర్ఎస్ నాయకత్వం దిశానిర్దేశం కోల్పోయిందన్న శ్రీధర్ బాబు
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని వెల్లడి
- బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శ

తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా దిశానిర్దేశం కోల్పోయి పక్కదారి పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శిం చారు. రోడ్లపై అనవసర ధర్నాలు, మీడియా ముందు మాట్లాడటం మాని నేరుగా అసెంబ్లీ సమావే శాలకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము ప్రతీదానికీ సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.



## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

- కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్
- కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు
- కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక



తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా?

...మిగతా 2 లో...

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన



కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవం తంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందిం చారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టే ందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

...మిగతా 2 లో...

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యంద



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తి స్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీ కరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.

...మిగతా 2 లో...

అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్..

## భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి
- అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం
- ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది. ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు.

...మిగతా 2 లో...

# హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'..

## ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

- స్థూపం ఏర్పాటులో చొరవ తీసుకున్న జైన మహిళలను కొనియాడిన కేంద్రమంత్రి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరోపగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు

మొదటిపేజీ తరువాయి

2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు.అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు.తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్–19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

# ధర్నాలు మాని అసెంబ్లీకి రండి.. సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం: శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతల కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకోవడం లేదా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని, ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులు.. గతంలో వారి ప్రభుత్వ హయాంలో ఇవే హామీలపై కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేకపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా వైఖరి మార్చుకోకపోతే, భవిష్యత్తులోనూ వీధుల్లోనే మిగిలిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్.. భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు."ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు.అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు.ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ శసమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

# 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం: మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు.

# పైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

మొదటిపేజీ తరువాయి

ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది. భవిష్యత్ లక్ష్యాలు ఇవే..భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు.భారత్ ఎల్లప్పుడూ అహింసా మార్గాన్నే అనుసరించిందని, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అహింస అనేది బలహీనత కాదని, అదొక గొప్ప బలమని అన్నారు. అహింసా స్థూపం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం ద్వారా 'నారీశక్తి' స్ఫూర్తిని, మహిళా నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఇది ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జైన సమాజ మహిళలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలే అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నారని, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' ఇందుకు నిదర్శనమని తెలిపారు.హైదరాబాద్ విభిన్న సంస్కృతులకు నిలయమని, నగరం సాధిస్తున్న ప్రగతి వెనుక ఈ వైవిధ్యమే కీలక శక్తిగా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలో జైన, బ్రాహ్మణ, మహేశ్వరి వంటి వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధితో పాటు వారసత్వం) అనే స్ఫూర్తితో 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో హైదరాబాద్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న స్వార్థ శక్తులను ఓడించడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటి యువత (జెన్–జీ) సాంకేతికతతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సాంస్కృతిక విలువలను ఎన్నడూ విస్మరించవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ కె. విశ్వేశ్వర్ రెడ్డి, జైన సమాజ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు భారత్ ఓకే... కానీ...!

మొదటిపేజీ తరువాయి

ఈ వక్రీకరణను సరిదిద్దేందుకు 'ఈక్వల్–ఏరియా' (సమాన విస్తీర్ణం) ప్రొజెక్షన్‌లను ప్రోత్సహించాలని కోరుతూ 'కరెక్ట్ ది మ్యాప్' పేరుతో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల ఆఫ్రికా, భారత్ వంటి గ్లోబల్ సౌత్ దేశాలు వాటి వాస్తవ పరిమాణంలో కనిపిస్తాయి. సెప్టెంబర్ 4న జరిగిన ఓటింగ్‌లో ఈ తీర్మానానికి అనుకూలంగా 164 దేశాలు ఓటు వేయగా, అమెరికా వ్యతిరేకించింది. మరో 6 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు.ఈ ఓటింగ్‌పై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. ఖండాల వాస్తవ పరిమాణాన్ని చూపించే సూత్రానికి మాత్రమే తాము మద్దతిస్తున్నామని, దీనివల్ల ఏదో ఒక నిర్దిష్ట మ్యాప్ ను (ఈక్వల్ ఎర్త్ వంటివి) ఆమోదిస్తున్నట్లు కాదని తెలిపారు. ఈ తీర్మానానికి, రాజకీయ సరిహద్దులకు, వివాదాస్పద ప్రాంతాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని భారత్ తేల్చిచెప్పింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లఢఖ్‌లతో కూడిన భారత భూభాగాన్ని, దేశ అధికారిక మ్యాప్ ప్రకారమే కచ్చితంగా చూపించాలని ఉద్ఘాటించింది. దీనికి భిన్నంగా చిత్రీకరించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అంగీకరించబోమని పేర్కొంది. ఈ తీర్మానం దేశాలపై చట్టపరంగా తప్పనిసరి కానప్పటికీ, వాస్తవ సైజులు ముఖ్యమైన చోట ఈక్వల్–ఏరియా మ్యాప్ లను వాడాలని ప్రభుత్వాలను, సంస్థలను ప్రోత్సహిస్తుంది.

# డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

మొదటిపేజీ తరువాయి

నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

మొదటిపేజీ తరువాయి

సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# ఐక్యంగా ఉద్యమిస్తేనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం..!

**జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**

**జర్నలిస్టులకు క్రమశిక్షణ అవసరం..!**

**రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే పైసల్**

**ఖేడ్‌లో టీయూడబ్ల్యూజే ఐజేయూ సర్వసభ్య సమావేశం**

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయి నుంచి గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని, ఐక్యంగా ఉద్యమిస్తామని టీయూడబ్ల్యూజే-- ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. ఖేడ్ లో ఆదివారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, సంఘం బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో పనిచేసే జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసి జిల్లా కమిటీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందేలా చూడడంతో పాటు ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టులకు సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ విస్తరణతో పాటు మండల స్థాయి కమిటీలను మరింత




క్రియాశీలం చేయాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. పైసల్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘటిత శక్తే ప్రధాన బలమన్నారు. సమస్య ఏ ఒక్క జర్నలిస్టుదైనా యూనియన్ సమస్యగా భావించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పత్రిక విలేకరులు, నియోజకవర్గ నాయకులు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు బాసిత్, సిద్ధన్న పాటిల్, అనిల్, శ్రీనాథ్, మతీన్, సత్యనారాయణ రెడ్డి, మల్లేశం, ఉల్లిగడ్డల శివకుమార్ , శ్రీనివాసరెడ్డి, ఎం.ఏ. రవూఫ్, ఆసిఫ్, బసవేశ్వర్, శ్రీధర్ జైన్, చవాన్ ఈశ్వర్, లక్ష్మణ్, నజీర్, హాజీ , మీనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాల్లో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్

**అమీన్ పూర్, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో జరిగిన పలు శుభ కార్యక్రమాల్లో బీజేపీ పార్టీ మండల అద్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ స్థానిక కాలనీ నాయకులతో ఆత్మీయంగా పాల్గొన్నారు. మిత్రుడు నారాయణ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై, సత్యనారాయణ స్వామి వ్రత పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి నారాయణ కుటుంబ సభ్యులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులతో ఆత్మీయంగా మాట్లాడి కాలనీల్లోని పరిస్థితులు, ప్రజల సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. ఆర్టీసీ వెంకటయ్య ముదిరాజ్ ను జరగనున్న తన గృహప్రవేశ కార్యక్రమానికి ఈర్ల రాజు ముదిరాజ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటయ్య కుటుంబ సభ్యులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజల సంతోషాల్లో కుటుంబ శుభకార్యాల్లో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ప్రజలతో ఆత్మీయ సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కాలనీల నాయకులు, మిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేసీఆర్ అధ్యక్షతన జరిగిన పార్టీ సీఎల్పీ సంయుక్త సమావేశం అనంతరం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజల సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాటం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ మరింత బలంగా పనిచేసేందుకు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమము కోసం నిరంతర పోరాటం







**జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

భారతదేశ స్వతంత్రం కంటే ముందే ఆవిర్భవించి నేటి వరకు ఉపాధ్యాయుల సంక్షేమము,సమాజ అభివృద్ధి, విద్యాభివృద్ధి కోసం నిరంతరశీ పోరాటాలు చేసిన సంఘం ఎస్ టీ యూ టీ ఎస్ అని డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్ లో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రాథోడ్ అధ్యక్షతన సంఘం 80 వసంతాల ఉపాధ్యాయ ఉద్యమ వైభవోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సంగారెడ్డిలో కేంద్రములో బైక్ ర్యాలీ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకోగా సభా ప్రాంగణం వద్ద రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్ చే జాతీయ పతాకావిష్కరణ అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ చే సంఘ పతాక ఆవిష్కరణ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ 2002 లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ , స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ లాంటి పోస్టులను సూత్రీకరించి సాధించిన ఏకైక సంఘమని, అప్రెంటిస్ విధానం కోసం పోరాడి సాధించిన సంఘం అని కరపత్రం ద్వారా తెలుసుకున్నానని అలాగే ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ను అందించమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర సంఘం అధ్యక్షులు సదానందశీ గౌడ్ కోరడం అదేవిధంగా ముఖ్యమంత్రి జీవో ఇప్పించడం లాంటి ఘనత ఎస్టియు సంఘానిదని అన్నారు. అలాగే ఉపాధ్యాయ సంక్షేమం కోసం మీరు చెప్పే విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తారని అన్నారు. మరొక అతిథి సంగారెడ్డి మున్సిపాలిటీ ప్రథమ పౌరురాలు వనిత సంతోష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘం 80 సంవత్సరాలుగా ఉపాధ్యాయ హక్కుల కోసం విద్యాభివృద్ధి కోసం పనిచే యడం గొప్ప అంశమని అన్నారు. అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు జి సదానందం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన అభయహస్తం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ ను రద్దు పరచి పాత పెన్షన్ ని అమలు చేయాలని అలాగే పిఆర్సి ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మాట్లాడుతూ పిఆర్సి డీఏ ల కోసం రెండేళ్లు కాదు కదా రెండు నెలలు కూడా ఆరోగ్య ప్రసక్తి లేదని ఇప్పటికే మూడున్నర సంవత్సరాల సమయం ముఖ్యమంత్రి కి ప్రభుత్వానికి కల్పించామని అయినా చులకనగా మాట్లాడడం సరైనది కాదని వెంటనే 51 శాతం ఫిట్మెంట్తో పి ఆర్ సి ని ప్రకటించి రేపు 10వ తారీఖున హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో జరిగే మహాధర్నాను మహా పాలాభిషేక సభగా మార్చుకోవాలని సూచించారు లేనిపక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులు మహా ధర్నాకు తండోపతండాలుగా కదిలివచ్చేటువంటి విషయాన్ని గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ మాట్లాడుతూ నిజాం నిరంకుశ కాలంలో ఉపాధ్యాయుల హక్కుల కోసం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వాలకు లొంగక ఉపాధ్యాయుల పక్షపాతంగా పోరాడుతుందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రాథోడ్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్, కాళోజి నారాయణరావు, విపి రాఘవచారి లాంటి ఎస్ టి యు ఉద్దండ మేధావులను నుండి నేటి ఉద్యమ బహుట సదానందం గౌడ్ జుట్టు గజేందర్ పర్వత్ రెడ్డి ,సయ్యద్ సాబేర్ అలీ లాంటి మేధావులను అందించిన సంఘం ఎస్టీయూ అని ఉపాధ్యాయులకు భరోసాగా సంఘం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీవన్ రాథోడ్ ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలను సభ చప్పట్లతో ఆమోదించి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ద్వారా ప్రభుత్వానికి అలాగే జిల్లా కలెక్టర్ కి అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణ కుమార్, జిల్లా పూర్వ అధ్యక్షులు కిషన్ రావు, శంకర్ గౌడ్, హరికిషన్, నరసింహారెడ్డి, నర్సింలు, టీజీవో జిల్లా అధ్యక్షులు, టి జి జేఏసీ జిల్లా సెక్రెటరీ జనరల్ డాక్టర్ వైద్యనాథ్, పూల శ్రీనివాస్, వ్యాఖ్యాతగా జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వాణిశ్రీ, భారతి నర్మద, నిర్మల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# శ్రావణ మాస భజన సమప్తి వేడుకల్లో ఆలయాలు ముస్తాబు

**తాండూర్, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

హిందువులకు పవిత్రమాస మైన శ్రవణ మాస ముగింపుకు చేరుకోవడం జరిగింది, రేపు చివరి సోమవారం సందర్భంగా పలు శివాలయాలు అంగరంగ వైభవంగా శ్రావణమాస ముగింపుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.బషీరాబాద్ మండల ఏకాంబరేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది,దాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ వాళ్ళు ఏర్పాట్లు చక్కగా నిర్వహిస్తున్నారు.



# ఘనంగా మహా పాదయాత్ర






**రాచన్న స్వామి దేవాలయం వరకు పాదయాత్ర**

**పాదయాత్రలో వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు, భక్తులు**

**జహీరాబాద్, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

లోక కళ్యాణార్థం వీరశైవ లింగాయత్ సమాజం జహీరాబాద్ తాలూకా ఆధ్వర్యంలో నాల్గవ మహా పాదయాత్రను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జహీరాబాద్ రాచన్న స్వామి మఠం నుంచి బడంపేట శ్రీ రాచన్న స్వామి దేవాలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగింది. ఈ మహా పాదయాత్రను వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు, భక్తులు పాదయాత్రలో పాల్గొని స్వామివారి నామస్మరణ చేస్తూ పాదా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షులు శంకర్ పాటిల్, గౌరవ అధ్యక్షులు సులుగంటి సిద్ధేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షులు పట్ల చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు ప్రసాద్ మధుశేఖర్, యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, కోశాధికారి పోలీస్ సంతోష్ కుమార్, సలహాదారులు అనిమిశెట్టి జయప్రకాష్, నాయికోటి రామప్ప, జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు ఆగురు శివరాజ్, జహీరాబాద్ పట్టణ సమాజ అధ్యక్షులు రాజశేఖర్ సెట్‌కార్, ప్రధాన కార్యదర్శి ఆర్. సుభాష్, సిద్ధాపురం అరుణ్ కుమార్ పాల్గొన్నారు. రాయికోడ్ మండల అధ్యక్షులు వై. పవన్ కుమార్, జిల్లా యువజన జాయింట్ సెక్రటరీ పోలీస్ ప్రవీణ్ కుమార్, చెన్నప్ప, శివకుమార్ స్వామి, పట్లోళ్ల శివకుమార్, ఎదుల సంగమేశ్వర్, పట్లోళ్ల నాగేశ్వర్, మహిళా గౌరవ అధ్యక్షురాలు అరుణా కౌలాస్‌తో పాటు పలువురు సమాజ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# తాండూర్ లో బిఆర్ఎస్ భారీ ఆటో ర్యాలీ.






**తాండూర్, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

తాండూర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు అమలుకాని 420 హామీలిచ్చి మోసం చేసిందని, ఆదివారం మాజీ ఎమ్మెల్యే పైలేట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ భారీ ఆటో ర్యాలీ నిర్వహించింది. విలేమున్ చౌరస్తా నుండి ప్రారంభమై ర్యాలీలో వందలాది మంది ఆటో కార్మికులు, డ్రైవర్లు గులాబీ జెండాలతో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని నాయకులు తెలిపారు.

# నిత్య కృషీవలునికి ఘన సత్కారం.





శ్రీ రామచందర్ రావు గారు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు వీరూరా ముదిమాణిక్యం, పుల్కల్ మండలం, సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న వీరు సమయపాలన, అంకిత భావంతో వినూత్నంగా, ఆటపాటల ద్వారా మరియు ఎన్నో కృత్యాల ద్వారా బోధిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల భవితను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుడు. ప్రస్తుతం మరియు గతంలో పని చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా మెరుగుపరచడంలో వీరి కృషి అనన్య సామాన్యం. మండల మరియు జిల్లా స్థాయిల్లో శిక్షణలను ఉపాధ్యాయులకు సమర్థవంతంగా ఇస్తూ ఉపాధ్యాయ వృత్తిపరమైన అభివృద్ధిలో కూడా పాటుపడుతున్న సవ్యసాచి. వీరు . జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనందుకుగాను మండల విద్యాధికారి శ్రీ వి శంకర్ గారు, ప్రధానోపాధ్యాయులు శ్రీ చందా శ్రీధర్ గారు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు గ్రామస్తులు అభినందన పూర్వకంగా హర్షం వ్యక్తం చేశారు.

# కందిలో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులు పంపిణీ

**సంగారెడ్డి, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**



మండల కేంద్రమైన కంది గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బాకి కార్డులను ప్రజలకు బిఆర్ఎస్ నాయకులు పంపిణి చేశారు. ఆదివారం మాజీ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో జగదీష్ శ్రీనివాస్ నర్సింగ్ వెంకట్రావు మక్త తండాలో బిఆర్ఎస్ కార్యకర్తలు కలిసి గ్రామస్తులకు కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఆర్థిక సహాయం, రైతులకు సంబంధించిన పథకాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర హామీలపై ప్రజలకు కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టడం సరికాదు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు చీకొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రాచన్న స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు

**కోహీర్, సెప్టెంబర్ 6, వార్త దీపిక న్యూస్ :**

మండల పరిధిలోని ప్రసిద్ధ బడంపేట శ్రీ శ్రీ శ్రీ రాచన్న స్వామి ఆలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాచన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాంలింగారెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, కోహీర్ మున్సిపల్ చైర్మన్ అశోక్, కోహీర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లన్న పాటిల్, నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షద్, మున్సిపల్ వైస్ చైర్మెన్లు శిరీష-- సురేందర్ రెడ్డి, జావిద్, సర్పంచ్ దయానంద్ పాటిల్, కోహీర్ పట్టణ కాంగ్రెస్ పా అధ్యక్షుడు ముజఫర్ పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, జాఫర్, జావిద్, అరుణ్ కుమార్, జమీలాలోద్దిన్, అక్రమ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.





Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984